


## నెలనెలా నవ్వుల పండగ

**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకటకృష్ణమూర్తి**

# నంబర్ నోట్ చేసుకున్నాలే!

**వెంగళ్రావు** ఓ చీరలషాపులో సేల్స్‌మేన్‌గా చేరాడు. ఆ షాపు యజమాని తను కొత్తగా కొన్న ఫోర్డ్ కారులో వచ్చాడు. కారు బయట పార్క్ చేసి ఆయన పూజచేయడానికి దేవుడి పూజా మందిరం వైపు వెళ్ళాడు. కొద్ది నిమిషాల తరువాత వెంగళ్రావు ఆయన దగ్గరకి పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు

"సార్! సార్! మీ కొత్తకారుని దొంగలు ఎత్తుకెళ్ళారు.."

"అరే! మరి నువ్వు వాళ్ళని ఆపలేదే!?"
ప్రశ్నించాడాయన గంభీరంగా!

"నేనింకో మంచి పనిచేశాను సార్! ఆ కారు లైసెన్సు నంబరు రాసి పెట్టుకున్నా ముందు జాగ్రత్తగా!" చెప్పాడు వెంగళ్రావు!

# సరదా సరదాగా... యర్రంశెట్టి శాయి

**"నా కళ్ళజోడు** పోవడం వల్ల రెండు లాభాలు వచ్చాయి" పరంధామయ్య అన్నాడు ఆనందంగా!
"ఏమిటవి?"
"నా మీద అధికారం చెలాయించే వాళ్ళిద్దరూ ఇంక నాక్కనిపించరుగా! - మా ఆఫీసరు, నా భార్య!!"

❀❀

**"అనగనగా ఓ రాజు.."** అంటూ అరేళ్ళ చక్రిగాడికి కథ చెప్పడం ప్రారంభించింది సుభద్ర.
"మమ్మీ! కథలన్నీ అనగనగాతోనే మొదలౌతాయా?"
"అన్నీ కాదు నాయనా..మీ నాన్నగారు నాకు చెప్పే కథలు 'సారీ సుభద్రా! ఆఫీసునుంచీ వస్తోంటే..' అంటూ కూడా మొదలౌతాయి.."

❀❀

**ఫోటోగ్రాఫరు:** చూడండి సార్! మీరు మీ భార్యగారి భుజం మీద చేయివేసి నిలబడితే ఎంతో సహజంగా ఉంటుంది..
**భర్త:** ఆమె నా జేబులో చేయివేసి నిలబడితే ఇంకా సహజంగా ఉంటుందోయ్!

❀❀

**భార్యాభర్త లిద్దరూ** న్యూస్ పేపర్ చదువుతున్నారు.
"స్టాక్ మార్కెట్ పెరిగిందనీ, తరిగిందనీ అంటారు- ఎందుకలా జరుగుతుంది?" అడిగింది భార్య.
"ద్రవ్యోల్బణం, నిలకడగా లేని డబ్బు విలువ, ప్రపంచ దేశాల్లో మారిపోతూండే హెచ్చు తగ్గులు, రాజకీయ పరిణామాలు.." ఇంకా చెప్పబోయాడు భర్త.
"చాల్లేండి బడాయి..తెలీపోతే తెలీదని చెప్పరాదూ!" మూతి ముడుచుకుందామె! "

❀❀

**"అబ్బ! మీ ఇల్లెంత నీట్‌గా ఉందోయ్!** నిజంగా నీ భార్యను అభినందించాల్సిందే!"

"ఏడ్చినట్లుంది! ఇల్లంతా సర్దేది నేనే!"
"అదే, అందుకే నీ భార్యను అభినందించాలి!"

❀❀

**పెళ్ళయి 30 ఏళ్ళు పూర్తయిన** సందర్భంలో డిన్నర్ ఇచ్చారు రామస్వామిగారు. డిన్నర్ అయాక ఆయన భార్య పార్వతమ్మతో ఆమె స్నేహితురాండ్రు పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు.
"ఓ సంగతి అడగాలనుంది పార్వతమ్మ గారూ..మీకూ ఆయనకు మధ్య రహస్యాలేమయినా ఉన్నాయా? అంటే ఒకరికొకరు తెలీకుండా దాచిన విషయాలు..?"
"అయ్యో ఎందుకులేవు! నేను బేంకులో నా ఎకౌంట్‌లో ఎనిమిది వేల రూపాయలు దాచుకున్న విషయం ఆయనకు తెలీనే తెలీదు. అలాగే ఆయన తన ఎకౌంట్‌లో పదివేల రూపాయలు దాచుకున్న విషయం నాకు తెలీనే తెలీదు!" అందామె.

❀❀

**ఓ చిన్న స్టేషన్‌లో** టిక్కెట్టు తీసుకుని రైలుకోసం ఎదురు చూడసాగాడో పెద్దమనిషి. ఎంత సేపటికీ రైలు జాడ లేకపోయే సరికి కోపంగా స్టేషన్ మేస్టర్ ఆఫీసువేపు నడిచాడు.
"ఇంకెంత సేపు పడుతుంది...ఆ వెధవ రైలు రావడానికి?" అనడిగాడు చిరాగ్గా.
"ఏ క్షణంలోనైనా రావచ్చు!" అన్నాడు స్టేషన్ మేస్టర్.
"మీ కెలా తెలుసు?" అనడిగాడు ఆ పెద్దమనిషి అనుమానంగా.
"అదిగో..ఆ రైలు నడిపే డ్రైవరు కుక్క స్టేషన్‌కి వచ్చేస్తోంది కదా!" అన్నాడు స్టేషన్ మేస్టర్ దూరంగా వస్తున్న కుక్కని చూపిస్తూ!

❀❀

**రైల్లో టి.టి.యి** ఫస్టుక్లాసు పాసింజర్‌ని అడిగాడు.
"మీరు దిగాల్సిన స్టేషన్ తెల్లవారు ఝామున అయిదింటికొస్తుంది. నాలుగున్నరకి మిమ్మల్ని లేపాలా?"
"అవసరం లేదు! రోజూ నాలుగున్నరకి లేవడం నా కలవాటే!"
"రక్షించారు.. అయితే దయచేసి నన్ను నాలుగున్నరకి లేపుతారా?"

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

**ఏదో ఆపరేషన్** చేయించుకోడానికి తక్కువఖర్చులో ఐపోతుందని ఓ చిన్న నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాడు జంబులింగం.

"మా ఆసుపత్రిలో ఆపరేషన్ అయ్యాక స్పెషల్ ట్రీట్‌మెంట్ ఉంటుంది.."

"అంటే?"

"ఆపరేషన్ అయ్యాక మా డాక్టర్‌గారు కుట్లు వెయ్యరు.."

"మరి?"

"మా డాక్టర్‌గారి ఫేమిలీ టైలర్ వేస్తాడు.."

❀❀

**"ఏమోయ్** ఎక్కడా కనిపించడం లేదే?"

"ఏమిటండీ..?" వంటింట్లో పోపు డబ్బాలన్నీ వెదికేస్తున్న భర్త జంబులింగాన్ని అడిగింది భార్య.

"అదే..నా జేబులో డబ్బులు కనిపించలేదు..అక్కడ పోతే మరి ఇక్కడే కదా దొరకాలి..!"

❀❀

**"ఇదో..ఈ జబ్బు తగ్గుతుందో లేదో**..కానీ నేను చనిపోయాక ఆ కామేష్‌నే పెళ్ళి చేసుకో..చాలా మంచివాడు.."

"ఎప్పుడూ మీ ఫ్రెండ్స్ గురించే చెబుతారు కానీ..నాకెవరూ బోయ్ ఫ్రెండ్స్ లేరనుకుంటున్నారా?" ఇంతెత్తున లేచింది భార్య కాంతమ్మ!

❀❀

**"కొత్తబట్టలు** ఎందుకు దొంగిలించావు?" న్యాయమూర్తి ప్రశ్నించాడు.

"మీ దగ్గరకి మరీ పాతబట్టలతో వస్తే బావుండదని.." నసుగుతూ చెప్పాడు ముద్దాయి.

❀❀

**"మా ఆవిడది** చాలా జాలి గుండె.తెలుసా?" జంబులింగం చాలా గర్వంగా చెప్పాడు.

"ఆహాఁ..అలాగా? ఎలా చెప్పగలవు?" మిత్రుడు అడిగాడు.

"మరేఁ..నేను అంట్లు తోముతుంటే చూడలేక కన్నీళ్ళు పెట్టుకుంటూ వేరే గదిలోకి వెళ్ళిపోతుంది.."

❀❀

**"శరత్..ఇంక** రేపటి నుంచీ నువ్వు నన్ను మరిచిపోవాలి.." లీలారాణి తన ప్రేమికుడితో చెప్పింది.

"అదేం..లీలా?"

"నాకు ఇంట్లో వేరే సంబంధం చూసేశారు.."

"పోనీలే లీలా.."

అదేమిటి..మీకు బాధగా లేదా?"

"నువ్వేం దిగులుపడకు.. నాకు మా అక్క కూతురు సిద్ధంగా ఉందిలే.."

❀❀

**"సార్..డబ్బులు లేకుండా** మీ హోటల్లో ఇడ్లీ తినేశాను..ఏమైనా శిక్ష విధించండి.."

"ఇంకా వేరే శిక్ష ఎందుకు? ఇడ్లీ తిన్నావు కదా..అదే శిక్ష.."

❀❀

**"అవునూ..**మీ పార్టీలీడర్ జైలునుంచీ తిరిగొచ్చాక ఏదో పుస్తకం వ్రాసున్నారట?"

"అవును..30 రోజుల్లో జైలునుంచీ బయటికి రావడం ఎలా? అని ఒక పుస్తకం వ్రాసున్నారులే.."

❀❀

**జంబులింగం, శంభులింగం మాట్లాడుకుంటున్నారు.**

"జంబూ..ఒక సారి నీ పెన్ ఇస్తావా?"

"అలాగే..ఇదిగో."

" ఓ తెల్లకాగితం కూడా ఇస్తావా?"

"తప్పకుండా..ఇదిగో.."

"పోస్టల్ స్టాంపులేవైనా ఉన్నాయా?"

"లేకేం..ఇంద తీసుకో.."

"అలా నువ్వు బయటికి వెళ్ళినపుడు ఈ లెటర్ పోస్ట్‌బాక్స్‌లో వేసి పెడతావా?"

"అదేమంత మహా భాగ్యమా? అలాగే.."

"చాలా థాంక్స్ జంబూ.. మరి ఒక్కసారి నీ గర్ల్ ఫ్రెండ్ అడ్రసు ఇవ్వగలవా?"

⌘⌘

**"మొన్న రాత్రి** నా కల్లోకొచ్చి వందరూపాయలు ఇచ్చారండీ.." వినయంగా చెప్పాడు నౌకరు.

"ఫర్వాలేదులే.. ఈ నెల జీతంలో వందా తగ్గించిస్తాలే.." జంబులింగం సంతోషంగా చెప్పాడు.."

"కానీ.."

"ఊఁ..చెప్పు..సందేహిస్తావెందుకు?" రెట్టించాడు జంబులింగం.

" నిన్నరాత్రి కల్లో నేనే మీకు మూడొందలు ఇచ్చానయ్య గారూ.."

***POST YOUR COMMENTS***